# వేడుకగా వెలుగుల పండుగ

వెలుగుల పండుగ దీపావళిని ప్రజలు వేడుకగా జరుపుకున్నారు. ఆదివారం సాయంత్రం నుంచే కాకరపువ్వులు, భూచక్రాలు, తారాజువ్వల వెలుగులతో వీధులన్నీ మెరిసిపోయాయి. చిన్నా..పెద్దా తారతమ్యం లేకుండా కొత్త దుస్తులు ధరించి.. బాణసంచా కాలుస్తూ సందడి చేశారు. ఇళ్లలో, ఆలయాల్లో పూజలు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఇళ్లలో కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా కాలుస్తూ ఆనందంగా గడిపారు.


కాశీబుగ్గ: పలాసలోని స్వగృహంలో దీపాలు వెలిగిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు దంపతులు


కాశీబుగ్గ: దీపాల వెలుగులో ఓ కుటుంబం సందడి


కాశీబుగ్గ: పలాస క్రీడామైదానంలో దీపాల పండగ చేసుకుంటున్న క్రీడాకారులు


కవిటి: కొత్తపుట్టుగలో క్రెకర్స్ కాలుస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు


సోంపేట: బాణసంచా కాలుస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్ దంపతులు


వజ్రపుకొత్తూరు రూరల్: సీతాపురంలో మతాబులు కాల్చుతున్న చిన్నారులు


ఇచ్ఛాపురం రూరల్: క్రెకర్స్ కాలుస్తున్న ఎంపీపీ బోర పుష్ప


ఇచ్ఛాపురం రూరల్: దీపాలతో లక్ష్మీదేవిని ఆహ్వానిస్తున్న బాలిక

## క్లుప్తంగా

### నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

టెక్కలి: బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక ఐజేహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు కోర్టు సిబ్బంది సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్ఆర్ తేజచక్రవర్తి మల్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదస్సులో భాగంగా పోక్సో చట్టం, గుడ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

### కిరాణా షాపులో అగ్ని ప్రమాదం

టెక్కలి రూరల్: స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ సమీపంలోని రాజేష్ కిరాణా షాపులోని మూడో అంతస్తులో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఇక్కడ ఖాళీ అట్టడొక్కులు, ఇనుప డబ్బాలు వంటివి నిల్వ చేస్తుంటారు. అయితే దీపావళి సందర్భంగా ఎవరో కాల్చిన బాణసంచా నిప్పురవ్వలు అట్టడొక్కులపై పడడంతో మంటలు వ్యాపించాయి. దీన్ని గుర్తించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది సకాలంలో చేరుకుని మూడు ట్యాంకర్ల నీటితో మంటలను అదుపుచేశారు. మంటలను అదుచేసిన వారిలో ఎస్ఎఫ్ఓ ఎస్ మల్లేశ్వరరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు మందసలో సామాజిక తనిఖీ ప్రజావేదిక

మందస: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉదయం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, ఉపాధి హామీ పథకం ఏపీవో బి.వి.హరికృష్ణ తెలిపారు. రాష్ట్ర రిసోర్స్ పర్సన్, పది మంది డీఆర్పీల సామాజిక తనిఖీ బృందం ఆడిట్ నిర్వహిస్తోందన్నారు.

### కాళీమాత ఉత్సవానికి పోటెత్తిన భక్తులు


అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తజనం

వజ్రపుకొత్తూరు: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దమురహరిపురం గ్రామంలో కొలువైన కాళీమాత ఉత్సవానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కాళీమాత అమ్మవారికి ముగ్రాటలతో చల్లదనం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జి.వసంతరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కె.గోపాల్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గర్తం దానేసు పాల్గొన్నారు.

**వైభవంగా కాళీమాత ఆలయ వార్షికోత్సవం**

కవిటి: ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం చింతామణి అమ్మవారి ఆలయం ఆవరణలో వెలసిన కాళీమాత ఆలయ 14 వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. వేకువ జాము నుంచే కాళికాదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలను భక్తులు నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా కాళీమాత వేషధారణలో వినియోగించే అమ్మవారి ముఖాల్ని ప్రత్యేకంగా పూజించారు. ఏకాహం భజన కాలక్షేపం జరిగింది. దాతల సహకారంతో రెండు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు.

### గ్రంథాలయాధికారిగా ఉదయ్‌కిరణ్



నందిగాం: స్థానిక శాఖా గ్రంథాలయాధికారిగా సత్తారు ఉదయ్‌కిరణ్ నియామకం అయ్యారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన జి.భారతి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో ఆమె స్థానంలో ఉదయ్‌కిరణ్ నియమితులయ్యారు.

### విద్యార్థిని చదువుకు సాయం


ప్రిన్సిపాల్‌కు ఫీజు అందజేస్తున్న సొసైటీ ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు: కంబారాయుడుపేట పంచాయతీ నారాయణరావుపేటకు చెందిన విద్యార్థిని జుత్తు పూజ చదువు కోసం ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సోమవారం ఆర్థిక సహాయం చేసి ఆదుకుంది. విద్యార్థిని తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. దీంతో తల్లి రూప ఒంటరైంది. చదువులో రాణిస్తున్న కుమార్తె పూజ కళాశాల ఫీజును చెల్లించలేని పరిస్థితి ఉండడంతో ఉద్దానం హెల్పింగ్ సొసైటీని ఆశ్రయించింది. దీంతో ఇంటర్మీడియెట్ మొదటి ఏడాది ఫీజు ఇప్పటికే చెల్లించగా ద్వితీయ సంవత్సరం ఫీజు, ప్రాక్టికల్ పరీక్ష ఫీజుకు అవసరమైన రూ.12 వేలును ప్రిన్సిపాల్ కైలాశ రావుకు అందజేశారు. సొసైటీ ఫౌండర్ కీలు విజయ్‌కుమార్, రుద్రమూర్తి, రాహుల్, తిరుపతి జోగారావు, షణ్ముఖరావు పాల్గొన్నారు.

### మిఠాయిలు పంపిణీ

కాశీబుగ్గ: కాశీబుగ్గ ప్రభుత్వ బాలసదనం చిన్నారులకు దీపావళి పండుగ సందర్భంగా పలువురు దాతలు మిఠాయిలు, బాణసంచా అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, గ్రీన్‌ఆర్మీ అధ్యక్షుడు బి గోపాల్, ప్రభుత్వ ఉద్యోగులు చిట్టిబాబు, శ్రీనివాసరావు, మధు, కృష్ణారావు, సుందర్ ఉన్నారు. అలాగే మాదిగాపురం గ్రామంలోని 30 మంది చిన్నారులకు కాశీబుగ్గ లయన్స్ క్లబ్ సభ్యులు బొమ్మ గన్‌లు, బాణసంచాను అందించారు. లయన్స్ అధ్యక్షుడు రోణంకి హేమాచలం, ఎంపీటీసీ సభ్యుడు రోణంకి ధర్మారావు ఉన్నారు.

## టెక్కలి నుంచి పంచారామాలకు ప్రత్యేక బస్సులు

టెక్కలి: కార్తీక మాసం సందర్భంగా పంచారామ క్షేత్రాలకు టెక్కలి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19, 25, డిసెంబర్ 3,10 తేదీల్లో టెక్కలి ప్రజా రవాణా కాంప్లెక్స్ నుంచి బస్సులు బయల్దేరుతాయని ఆయన పేర్కొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు బస్సు బయలుదేరి ఉదయం అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట తదితర శైవ క్షేత్రాలకు చేరుకుని తిరిగి మంగళవారం ఉదయం టెక్కలి చేరుకుంటుందని పేర్కొన్నారు. సూపర్ లగ్జరీకి రూ.2600, అల్ట్రా డీలక్స్‌కు రూ.2550, ఎక్స్‌ప్రెస్ కు రూ.2150 ధర నిర్ణయించినట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు వెల్లడించారు. అలాగే శబరిమల అయ్యప్పస్వామి దర్శనానికి 7 రోజులు, 11 రోజుల పర్యటనకు ప్యాకేజీ రూపంలో బస్సు అద్దెకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9959225611, 7382923311 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

## స్నేహితుడి కుటుంబానికి అండగా..


సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కాశీబుగ్గ: తమతో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థి మరణం వారిని కలచి వేసింది. అతని కుటుంబానికి అండగా నిలవాలని భావించి..కొంతమొత్తాన్ని సేకరించి అందజేశారు. వివరాల్లోకి వెళితే.. పలాస మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన జానపద కళాకారుడు సాలిన అశోక్ బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్నాడు. ఈయన ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. విషయం తెలుసుకున్న అతనితో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా వాట్సాప్ వేదికగా చేసుకొని రూ. 62,100 సేకరించారు. ఈ మొత్తాన్ని అశోక్ కుటుంబ సభ్యులకు గ్రామ పెద్దల సమక్షంలో సోమవారం అందజేశారు. అనంతరం పిల్లల పేరుతో ఫిక్సిడ్ డిపాజిట్ చేయించారు.

## లొహరిబందకొత్తూరులో కబడ్డీ పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న వల్లభరావు

మందస: లొహరిబందకొత్తూరులో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే పోటీలను వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సచివాలయం కన్వీనర్ కొరికాన వల్లభరావు ప్రారంభించారు. 60 కిలోల బరువు విభాగంలో జరిగిన పోటీలనుద్దేశించి వక్తలు మాట్లాడుతూ.. ఉద్దానం కళలు, క్రీడలకు పుట్టినిల్లని, ఏటా పండగలు, ఉత్సవాలు పోటీలు నిర్వహించడం సంప్రదాయమన్నారు. సుమారు 63 జట్లు తలపడుతున్నాయి. కార్యక్రమంలో పార్టీ పంచాయతీ అధ్యక్షుడు ధర్మాన దువ్వయ్య, గ్రామపెద్దలు అందాల రామయ్య, కొరికాన అప్పలస్వామి, ముడిమించి గిరీశం, కొరికాన మాధవరావు, ధర్మాన లక్షుమయ్య, ఊళ్ల తవిటయ్య, సార గున్నయ్య పాల్గొన్నారు.

## క్విజ్ పోటీల విజేత కొత్తపల్లి హైస్కూల్


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: గరుడబద్రలో షైనింగ్ స్టార్ యువజన సంఘం, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన డివిజన్ స్థాయి క్విజ్ పోటీల్లో మందస మండలం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతగా నిలిచారు. ద్వితీయ స్థానంలో మందస మండలం హరిపురం హైస్కూల్, తృతీయ స్థానంలో వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. విజేతలకు స్థానిక సర్పంచ్ గూడ గిరిజ, ఎంఈవో బి.వెంకటరమణ, యువజన సంఘాల అధ్యక్షుడు వై.సంతోష్, వై.ధర్మారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గూడ ఈశ్వరరావు చేతుల మీదగా నగదు బహుతులతో పాటు జ్ఞాపికలను అందజేశారు. పాఠశాల హెచ్ఎం దిలీప్‌కుమార్, నాయకులు, యువజన సంఘ సభ్యులు జి.ధనరాజ్, కె.మన్మథరావు, చెల్లూరు ధనరాజ్, బి.రాజేష్, వై.తాతయ్య, జి.నగేష్, టి.శ్రీను, ఎస్.కోటేశ్వరరావు, కె.మోహన్, మహేష్ ఉన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి
- దండుగోపాలపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


ప్రజలకు సంక్షేమాన్ని వివరిస్తున్న దువ్వాడ వాణి

సంతబొమ్మాళి: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. దండుగోపాలపురం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. ఎంత లబ్ధిపొందారో వివరించి బ్రోచర్లను అందజేశారు. అవినీతికి తావులేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, వైస్ ఎంపీపీలు పి.తులసమ్మ, నక్క చింతామణి, స్థానిక సర్పంచ్ మార్పు అశోక చక్రవర్తి, మండల పార్టీ అధ్యక్షుడు జీరు బాబూరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు దువ్వాడ హైందవి, సంపతిరావు రాఘవరావు, పి.రామకృష్ణ, ఎం.అప్పారావు, మార్పు నాగభూషణ్, పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలపై ప్రచారం


కొత్తపేటలో ప్రచారం చేస్తున్న నాయకులు

కోటబొమ్మాళి: మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నూక సత్యరాజ్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి గెడ్డవలస నాఘభూషణరావు ఆధ్వర్యంలో సోమవారం కోటబొమ్మాళి, కొత్తపేట, చిన్నసాన గ్రామాల్లో సంక్షేమ పథకాలపై ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి వారికి చేరిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌వో తారకేశ్వరరావు, కన్వీనర్లు మేడిబోయిన నారాయణరావు, అక్కురాడ సురేష్, ఆర్.శివారెడ్డి పాల్గొన్నారు.

### దుస్తులు పంపిణీ


దుస్తులు అందజేస్తున్న దృశ్యం

కంచిలి: మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమంలో వృద్ధులు, అనాథలకు దాతల నుంచి అదనంగా వచ్చిన దుస్తులను ఆశ్రమ నిర్వాహకులు గిరిజనులకు పంపిణీ చేశారు. దీపావళి పండుగను పురస్కరించుకొని దుస్తులను ఆదివారం మండలంలోని గిరిజన గ్రామాలైన అరకభద్ర, రంగోయి, సింగుపురం, డెప్పసాయి, తెంబుర గ్రామాల ప్రజలకు వీటిని పంపిణీ చేశారు. ఆశ్రమ వ్యవస్థాపకులు గుళ్ల రమేష్, మోహనరావు, సోంపేటకు చెందిన సానా గణేష్, కిమ్మోజి ఢిల్లేశ్వరరావు, టీడీఆర్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

### 'నిందలు వేయడం తగదు'

ఇచ్ఛాపురం: తమ కుటుంబ సభ్యులపై నిందలు వేయడం తగదని పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి ప్రత్తి రాజేష్ భార్య సునీత తెలిపారు. దాసన్నపేటలోని తన ఇంటివద్ద తల్లి రాణితో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సెప్టెంబర్ 29వ తేదీన రాజేష్ ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని చనిపోయాడు. ఇతనిది ఆత్మహత్య కాదని.. మృతిపై అనుమానాలు ఉన్నాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేసిన నేపథ్యంలో విలేకరులతో మాట్లాడారు. తమ కుటుంబంపై నిందలు వేయడం తగదని సునీత ఆవేదన వ్యక్తం చేశారు. ఏమైనా అనుమానాలుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే నిజాలు వెలుగు చూస్తాయన్నారు. తన భర్తకు వివాహేతర సంబంధాలున్నాయని.. అది తెలుసుకుని ఐదు సంవత్సరాలుగా అతనికి దూరంగా ఉంటున్నానని చెప్పారు. అలాగే అప్పుల బాధలు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటారన్నారు. అతని మృతితో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

### నందన్న సంబరాలకు మంత్రి హాజరు


మంత్రి అప్పలరాజును సన్మానిస్తున్న దృశ్యం

పలాస: చినంచల గ్రామంలో జరుగుతున్న నందన్న ఉత్సవాల్లో మంత్రి సీదిరి అప్పలరాజు సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందిరం వద్ద ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. పంచాయతీకి చేసిన సేవలకు కృతజ్ఞతగా ఎంపీటీసీ సభ్యుడు బమ్మిడి దుర్యోధనరావు అధ్యక్షతన మంత్రిని సత్కరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పానిల శ్రీనివాసరావు, ఎంపీపీ సాయిప్రవీణ, పార్టీ మండల అధ్యక్షుడు పైల వెంకటరావు, జెడ్పీటీసీ సభ్యుడు రత్నాలు ధనరాజు, ఎంపీడీవో రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

### విశ్రాంతి మండపం పనులు ప్రారంభం

కంచిలి: కొల్లూరు పంచాయతీ పరిధి కర్తలి గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.1.2 లక్షలతో చేపట్టనున్న ప్రజా విశ్రాంతి మండపం నిర్మాణ పనులను స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నేతడు పైల గణేష్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ పైల భీమారావు పాల్గొన్నారు.

### నేడు రావివలసలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

టెక్కలి: రావివలస గ్రామ సచివాలయం వద్ద మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బగాది హరి, జేసీఎస్ ఇన్‌చార్జి శిగిలిపల్లి మోహన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

## ఆలయాల్లో కార్తీక పూజలు


కంచిలి: పాతాళేశ్వర ఆలయంలో నందీశ్వరుడ్ని పూజిస్తున్న భక్తులు


సోంపేట: పూజలందుకున్న బారువ కోటిలింగేశ్వర స్వామి

కంచిలి: శివాలయాల్లో కార్తీక సందడి నెలకుంది. సోమవారం వేకువజాము నుంచే శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని పాతాళేశ్వర ఆలయంతోపాటు పుడాబద్ర, కంచిలి, మఠం సరియాపల్లి, తలతంపర, పెద్దశ్రీరాంపురం, జాడుపూడి, పెద్దకొజ్జిరియా, జలంత్రకోట, శాసనాం గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు జరిగాయి.

సోంపేట: సోంపేట సోమేశ్వర, కాశీవిశ్వేశ్వర, బారువ కోటిలింగేశ్వర స్వామి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయకమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని పలు శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడిపోయాయి. ఆలయాల్లో భక్తులకు సమారాధన చేశారు.

ఇచ్ఛాపురం: పట్టణంలోని ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.


ఇచ్ఛాపురం రూరల్: బొడ్డబడ శివాలయం వద్ద బారులు తీరిన భక్తులు


ఇచ్ఛాపురం: పాతాళసిద్ధేశ్వరాలయం వద్ద భక్తజనం

## బ్రహ్మోత్సవాల్లో అలరించిన నాట్య ప్రదర్శన


నాట్యకారులను అభినందిస్తున్న టీటీడీ అధికారులు

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన వెంకటేశ్వర డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీకి చెందిన 25 మంది నాట్యకారులు తిరుమల తిరుపతి దేవస్థానంలో కార్తీక బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శించిన నాట్యప్రదర్శన అందరిని ఆలరించాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శని, ఆదివారాల్లో టీటీడీ శిల్పారామం, తిరుచానూరు పద్మవతి అమ్మవారి ఆలయాల్లో కూచిపూడి భరతనాట్యం, అన్నమయ్య కీర్తనలకు ప్రదర్శనలిచ్చారు. ప్రదర్శనలను కూచిపూడి గ్రామానికి చెందిన ప్రముఖ నాట్యగురువు ఏలేశ్వర శ్రీనివాసులు పర్యవేక్షించారు. అకాడమీ అధ్యక్షుడు చిన్నా గురుస్వామి, నాట్యకారులు టీటీడీ అధికారుల అభినందనలు అందుకున్నారు.

## ఎక్స్‌ప్రెస్ సర్వీసులను పునరుద్ధరించాలని వినతి


గేట్ మీటింగ్‌లో పాల్గొన్న సిబ్బంది

పలాస: రద్దు చేసిన ఇచ్ఛాపురం–విశాఖ ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని ఏపీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంటు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం పలాస డిపో వద్ద గేట్ మీటింగ్ పెట్టారు. పది బస్సు సర్వీసులను నెల రోజులుగా నిలిపి వేయడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అనంతరం మంత్రి సీదిరి అప్పలరాజుకు వినతిపత్రం సమర్పించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పి.భానుమూర్తి, జోనల్ కార్యదర్శి బి.కె.మూర్తి, జిల్లా అధ్యక్షుడు జి.త్రినాథ్ పాల్గొన్నారు.